క్లుప్తంగా

రేపు గాయత్రీ మహాయజ్ఞం, సరస్వతీ పూజ

చీరాల టౌన్: సరస్వతీ జయంతి మాఘపంచమిని పురస్కరించుకుని వాడరేవు సమీపంలో ఉన్న శ్రీరామహంస సహ్యాద్రి ఆశ్రమంలో సరస్వతీ పూజ, 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం, అక్షరాభ్యాసాలను నిర్వహిస్తున్నామని ఆశ్రమం నిర్వాహకులు సుమంగళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండిత శ్రీరామవర్మ ఆచార్య ఆధ్వర్యంలో గాయత్రీ మహాయజ్ఞం, సరస్వతీ పూజలను నిర్వహిస్తున్నామని అధికసంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు.

ముఖమండప నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న దాతలు

అద్దంకి: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ముఖ మండప నిర్మాణం కోసం దాతలు చేయూతనిస్తున్నారు. దానిలో భాగంగా సోమవారం దాత చిలకలూరిపేటకు చెందిన మచ్చా రామకృష్ణ ప్రసాద్, అపర్ణ దంపతులు ముఖ మండప నిర్మాణం కోసం రూ.1 లక్ష దేవస్థాన సహాయ కమిషనర్ సుభద్రకు అందజేశారు.

మోపెడ్‌ను ఢీకొన్న కారు

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న టీవీఎస్ మోపెడ్‌ను ఒంగోలు వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన సోమవారం పీ.గుడిపాడు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామానికి చెందిన డీ.వీరనారాయణ మోపెడ్‌పై పీ.గుడిపాడు జాతీయ రహదారి వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. అదే సమయంలో విజయవాడ వైపు నుంచి ఒంగోలు వైపుకు వెళ్తున్న కారు మోపెడ్‌ను బలంగా ఢీకుంది. దీంతో వీరనారాయణ రోడ్డుపై పడిపోగా కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వ్యక్తిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హైరిస్క్ గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి

స్వర్ణ (కారంచేడు): గ్రామాల్లోని హైరిస్క్ గర్భిణుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ షాలినీ, డాక్టర్ హస్మప్రియలు అన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు, స్కానింగ్‌లు చేయించాలన్నారు. ప్రతి గర్భిణిని మూడో నెలలోనే తమ పేర్లు, భర్త, చిరునామా, వారికి సంబంధించిన పూర్తి వివరాలతో ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉందన్నారు. ఇలా నమోదు అయిన వారికి క్రమం తప్పకుండా వివిధ రకాల పరీక్షలతో పాటు, వైద్యుల సలహాలను అందించాలన్నారు. బిడ్డ ఎదుగుదలతో పాటు, రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ మీనాకుమారి, మాధురీ సిఫోరా, ఎల్‌టీ బీ శంకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: జీవాల ఆరోగ్యంపై పశుపోషకులు జాగ్రత్తలు పాటించడం వలన సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యురాలు పావని సూచించారు. సోమవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 54 గేదెలు, 24 దూడలకు, మేకలు 49 వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా పావని మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం, పశువుల పెంపకం ముఖ్యమైనవని పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటుగా క్రమం తప్పకుండా చూడి పరీక్షలు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు, పాల ఉత్పత్తి పెరిగేందుకు అవసరమైన దాణాలను, అనారోగ్యంతో ఉన్న జీవాలకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పశువైద్యశాల సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ

వేటపాలెం: పొట్టిసుబ్బయ్యపాలెం మత్స్యకార గ్రామంలో లైఫ్ జాకెట్లను మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం రవీంద్ర సోమవారం మత్స్యకారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద సీ సేఫ్టీ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న మత్స్యకారులకు 75 శాతం రాయితీపై లైఫ్ జాకెట్లు అందజేస్తారని తెలిపారు. వేటకు వెళ్లే ప్రతి బోటులో సీ సేఫ్టీ పరికరాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని తెలిపారు. విపత్తుల సమయంలో ఈ పరికరాలే మత్స్యకారులకు ప్రాణ రక్షణ కవచాలుగా ఉపయోగపడతాయిని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి శివలీల, కట్టా వినయ్ కుమార్, వీఎఫ్ఏ డీ బాలునాయక్, సాగరమిత్రలో లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు రాములు, అంజయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో గ్రామీణ రోడ్లు



రోడ్డు పనులు చేస్తున్న పొక్లెయిన్



ఎర్రమట్టి వేయడానికి సిద్ధంగా ఉన్న పొలిమేర రోడ్డు

- వల్లాపల్లిలో పొలిమేర రోడ్డు అభివృద్ధి
- 5 దశాబ్దాలుగా అభివృద్ధికి నోచని పంట పొలాల రోడ్డు
- సమన్వయకర్త చిన హనిమిరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న నాలుగు గ్రామాల రైతులు

బల్లికురవ: ఐదు దశాబ్దాలుగా నుంచి వస్తున్న సమస్యలను ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో చాలాసార్లు సమస్యను విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. రైతులు పొలాలకు వెళ్లేందుకు, పంట ఉత్పత్తులను తరలిచేందుకు ఏర్పాటు చేసుకున్న పొలిమేర రోడ్డు బురదతో ఆనవాళ్లే కోల్పోయింది. నాలుగు గ్రామాల రైతులు ఈ విషయాన్ని అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో తక్షణమే స్పందించారు. రోడ్డు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళితే బల్లికురవ–అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్డులోని వల్లాపల్లి గ్రామ మసీదు నుంచి ఎన్నెస్పీ కాల్వ వరకు వెళ్లేందుకు 5 దశాబ్దాల క్రితం వల్లాపల్లి, చిన అంబడిపూడి, కొమ్మినేని వారిపాలెం, గ్రామాల రైతులు తమ పొల్లాలో గుండా రెండు కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ఈరోడ్డుకు గత 5 దశాబ్దాల్లో చారెడు మట్టిని వేసిన దాఖలాలు సైతం లేవు. డొంకరోడ్డు బురదలో గుండానే రైతులు, వ్యవసాయ కూలీలు వెళ్లాందే పంట ఉత్పత్తులను తరలించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

ఫార్మేషన్ రోడ్డు ఏర్పాటు..

అద్దంకి నియోజకవర్గ సమన్వయ కర్త హనిమిరెడ్డి సహకారంతో వల్లాపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు మంచ్యాల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మందా మోహన్‌రావులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. ఫార్మేషన్ రోడ్డు పైపు కల్వర్టులు ఏర్పాటుతో ఎర్ర గ్రావెల్ తోలనున్నారు. మసీదు నుంచి వల్లాపల్లి కొండ వరకు వెళ్లేరోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ రోడ్డులోని చిల్ల చెట్లు తొలగించటంతో రైతులకు ఇబ్బందులు తొలగాయి. రోడ్ల అభివృద్ధికి సహకారం అందించిన హనిమిరెడ్డికి నాలుగు గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పొలిమేర రోడ్డు అభివృద్ధి ఆనందాన్ని ఇస్తోంది..



ఐదు దశాబ్దాల క్రితం రైతులు ఏర్పాటు చేసుకున్న పొలిమేర డొంక రోడ్డు హనిమిరెడ్డి సహకారంతో అభివృద్ధి పరుచుకోవటం చాలా ఆనందంగా ఉంది. 4 గ్రామాల రైతులు పంటపొలాలకు వెళ్లాలన్నా ఉత్పత్తులు మార్కెట్‌కు తరలించాలన్నా ఇబ్బందులు పడ్డారు. నేటితో ఆ ఇబ్బందులన్నీ తొలగనున్నాయి. బైకులు, ఆటోలు, ట్రాక్టర్‌లు నేరుగా ఎన్నెస్పీ కాల్వ వరకు వెళ్లవచ్చు

– మందా మోహనరావు, సర్పంచ్

అడిగిన వెంటనే పనులు చేయిస్తున్నారు..



హనిమిరెడ్డి అన్న అద్దంకి నియోజకవర్గంలోని ఏ గ్రామంలో నైనా అభివృద్ధి పనులకు చేయూత నిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రధాన లింకురోడ్డు పంట పొలాల రోడ్డు అభివృద్ధి చేయించారు. ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యుడిగా ఆప్యాయతతో ఆదరిస్తున్నారు. మసీదు నుంచి కొండ వరకు వెళ్లే రోడ్డులో చిల్లచెట్లు తొలగింపు అంగన్వాడీ కేంద్రం అభివృద్ధి చేపదుతున్నాం.

– మంచ్యాల శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు

18న దత్తపీఠ ఉత్తరాధిపతి రాక



వివరాలు వెల్లడిస్తున్న ట్రస్టీ చైర్మన్ హనుమత్ ప్రసాద్

అద్దంకి: దత్త పీఠ ఉత్తరాధిపతి శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ ఈ నెల 18న అద్దంకి విచ్చేయనున్నట్లు ట్రస్టీ చైర్మన్ నాగసూరి హనుమత్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన 18న పట్టణంలోని ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రానికి ఉదయం 9 గంటలకు వస్తారని తెలిపారు. ఆరోజు స్వామీజీ పర్యవేక్షణలో సారహోమం, తైలాభిషేకం స్వాగతసభ, అనుగ్రహ భాషణం, అన్నప్రసాదం వినియోగం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శ్రీచక్రార్చన, దివ్యనామ సంకీర్తన నిర్వహిస్తారని తెలిపారు. 19వ తేదీ ఉదయం 10 గంటలకు వీడ్కోలు సందేశం, క్షేత్ర ట్రస్టీలు, మృత్యుమండలి సభ్యులు, ఎస్‌డీహెచ్ఎస్ వలంటీర్లు స్వామీజీ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

బధిరుల పాఠశాలలో డిజిటల్ తరగతులు



స్మార్ట్ తరగతి గదిని ప్రారంభిస్తున్న డెక్కన్ సంస్థ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో నాగులపాలెం గ్రామంలో నాగుబడి రంగయ్య అచ్చమ్మ బధిరుల పాఠశాలలో రోటరీ క్లబ్ హైదరాబాద్ డెక్కన్ అనుబంధ సంస్థ డేర్ ప్రాజెక్ట్ సహకారంతో సోమవారం స్మార్ట్ డిజిటల్ తరగతి గదిని ప్రారంభించారు. సుమారు రూ 2.15 లక్షల విలువగల పరికరానికి రూ.1.15 లక్షలు హైదరాబాద్ డెక్కన్ వారు అందించారు. క్లబ్ గతంలో టాయిలెట్స్‌కు రూ.1.15 లక్షలు అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో పీడీజీ తాళ్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ వికాస్ కార్యక్రమంలో భాగంగా నాగులపాలెం రోటరీ క్లబ్ సెంట్రల్ వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఎంఈఓ పీ వెంకటరామయ్య మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక శిక్షణను ఉపాధ్యాయులు అందజేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో డీజీఈ కే శరత్, డేర్ ప్రాజెక్ట్ చైర్మన్ త్రిపురనేని మురళి, క్లబ్ కార్యదర్శి బీ సదానందరెడ్డి, కోశాధికారి కోమటి ఆంజనేయులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



బొల్లాపల్లిలో సచివాలయ భవనం

మార్టూరు: 14వ తేదీ బుధవారం మండలంలోని బొల్లాపల్లి, చిమ్మిరిబండ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ప్రారంభించనున్నారని ఆపార్టీ మండల అధ్యక్షుడు పఠాన్ కాలేషావలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొల్లాపల్లి గ్రామంలో సుమారు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్‌క్లినిక్‌లతో పాటు చిమ్మిరిబండ గ్రామంలో సుమారు రూ. 50 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, సీసీరోడ్లను ఆమంచి ప్రారంభిస్తారన్నారు. మండలంలోని అధికారులు ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ప్రకటనలో కోరారు. నేడు మంగళవారం పర్చూరు మండలం చెరుకూరులో నాలుగో విడత ఆసరా కార్యక్రమంలో ఆమంచి పాల్గొననున్నాని నాయకులు తెలిపారు.

విద్యార్థులకు ఉపాధ్యాయుల అభినందనలు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చినగంజాం: అథ్లెటిక్స్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు చినగంజాం కస్తూర్బా బాలికా విద్యాలయానికి చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. విద్యాలయంలో చదువుతున్న బీ ప్రజ్ఞ లాంగ్ జంప్, ఎం జెస్సీ 200 మీ రన్నింగ్, డీ సింధు 600 మీ పరుగు పందెంలో జాతీయ స్థాయిలో ఎంపికయ్యారు. కడవకుదురులో అండర్–14 అథ్లెటిక్స్ ఎంపికల్లో వారు పాల్గొన్నారు. ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించనున్న 19వ జాతీయ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు వారు హాజరు కానున్నట్లు కస్తూర్బా బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం సుమాంజలి తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారిని పీడీ ఎస్ వాణిశ్రీ, కే మల్లేశ్వరి, కే మానస ఉన్నారు.

లోహశిల్పి రామలింగాచారికి సత్కారం

చీరాల అర్బన్: అయోధ్య రామమందిర నిర్మాణంలో బాలరాముని బంగారు పాదుకలు (మొదటి ముద్రలు) నమూనా తయారు చేసిన హైదరాబాద్‌కు చెందిన పి.రామలింగాచారిని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం తరుపున సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సత్కరించారు. సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మ ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన తయారు చేసిన పాదుకలకు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో చీరాల పేరాల పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారి ఆదిమూలం ప్రభాకరరావు, సంఘ నాయకులు గొర్రెపాటి వెంకటేశ్వరరావు, జి.ప్రసాద్‌లు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

చినగంజాం: మండలంలో ప్రకృతి వ్యవసాయం నిర్వహిస్తున్న సిబ్బంది సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పూర్తిగా ప్రకృతిలో లభించే వస్తువులతో తయారు చేసిన కషాయాలతో పండించిన కూరగాయలు కావడంతో వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని వారు కొనుగోలుదారులకు అవగాహన కల్పించి వాటిని అమ్మకం చేశారు. కార్యక్రమంలో మండల కమ్యూనిటీ యాక్టివిస్ట్ బీ విజయమ్మ, మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ గీత, ఐసీఆర్‌పీ టీ రజని, పీ లోకేశ్వరి, బీ జ్ఞానానందం, ఎస్ ప్రసన్న, శ్రీలక్ష్మి, తిరుపతమ్మ, ఉదయభాస్కర్, ఖాదరయ్య, శాంతి పాల్గొన్నారు.

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



న్యాయవాదులతో కూర్చున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల రూరల్: న్యాయవాదులు రద్దు చేయమంటున్న ఏపీ భూయాజమాన్య హక్కుల చట్టం గురించి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. ఏపీ భూయాజమాన్య హక్కుల చట్టం–2022ను రద్దు చేయాలని కోరుతూ చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ముందు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు ముగించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ దీక్షా శిబిరాన్ని సందర్శించి న్యాయవాదులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

దళితుల పక్షాన నిలిచిన ఏకైక సీఎం జగన్

చినగంజాం: దళితుల పక్షాన నిలిచిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి అని అటువంటి దళిత పక్షపాతిని తిరిగి సీఎంగా ఎన్నుకోవాల్సిన అవసరం దళితులందరిపై ఉందని మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ పాదర్తి ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక దళితుడిని రాజ్యసభకు పంపించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని, గతంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు దళితుడైన వర్ల రామయ్యను రాజ్యసభకు పంపిస్తానని మోసగించాడని అన్నారు. దళితుడిని రాజ్యసభకు పంపించిన ఘటన రాష్ట్ర చరిత్రలో ఇంత వరకు లేదని అటువంటిది సీఎం జగన్ దళితుడైన గొల్లా బాబురావును రాజ్యసభకు పంపించడం దళిత జాతి గర్వించదగిన విషయం అని పేర్కొన్నారు.

పీఎం ఈజీపీలో సబ్సిడీ రుణాలు

బల్లికురవ: ప్రభుత్వం పీఎం ఈజీపీలో వివిధ యూనిట్లకు సబ్సిడీ రుణాలు ఇస్తుందని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి పీ. మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొర్రెలు, మేకలు కోళ్ల పెంపకం యూనిట్లకు రూ.20 లక్షల నుంచి కోటి వరకు 50 శాతం సబ్సిడీ 40 శాతం బ్యాంకు రుణం, 10 శాతం రైతువాటా చెల్లించాలన్నారు. గేదెల యూనిట్‌కు రూ.5 నుంచి రూ.20 లక్షల వరకు 35 శాతం సబ్సిడీ, 5 శాతం రైతు వాట 60 శాతం బ్యాంకు రుణం పొందవచ్చని వైద్యాధికారి వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నరసింహారెడ్డిని కలిసిన పట్టణ ఆటో యూనియన్ సభ్యులు

అద్దంకి రూరల్: ఆటో యునియన్ సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు పానెం నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అద్దంకి పట్టణ ఆటో యూనియన్ సంఘం నరసింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలో ఆటోస్టాండ్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. మంగళవారం హనిమిరెడ్డికి మద్దతుగా పట్టణంలో ఆటో ర్యాలీ నిర్వహిస్తున్న తెలిపారు.

వెటర్నరీ అసిస్టెంట్‌పై దాడి కేసు నమోదు

కారంచేడు: వెటర్నరీ అసిస్టెంట్‌పై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొడవలివారిపాలెం గ్రామం వద్ద రోడ్డుపై వేసి నీటి పైపులపై నుంచి ద్విచక్రవాహనాన్ని నడిపాడనే కోపంతో జరుబులవారిపాలెం వెటర్నరీ అసిస్టెంట్ టీ గురవయ్యపై గ్రామానికి చెందిన కొంత మంది శనివారం దాడి చేసి గాయపరిచారు. గాయపడిన గురవయ్య చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చీరాల ఔట్‌పోస్ట్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఆదివారం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నామని తెలిపారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ





చీరాల: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సోమవారం రాత్రి రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, సమన్వయకర్త కరణం వెంకటేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.



సభలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

- సీసీ రోడ్ల ప్రారంభంలో ఎమ్మెల్యే కరణం



నూతన సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: చీరాల పురపాలక సంఘం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 3 వార్డులో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైయిన్లు ప్రారంభం చేశారు. నూతన రోడ్లు, డ్రైయిన్లు ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల పురపాలక సంఘంలో ఉన్న 33 వార్డుల అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతీ వార్డులో నూతనంగా సీసీ రోడ్లు, డ్రైయిన్లు ఏర్పాటు చేసి అన్నీ వార్డులను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధితో పాటుగా చీరాల మున్సిపాలిటీని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వేగంగా సుందరీకరణ చేస్తున్నామన్నారు. పురపాలక ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులు, ఆహ్లాదాన్ని అందించేలా పార్కులు అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బి.జైసన్‌బాబు, వార్డు కౌన్సిలర్లు కలవకూరి యానాదిరావు, బత్తుల అనీల్, గుంటూరు ప్రభాకరావు, నాయకులు ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్, నాని, మున్సిపల్ డీఈ ఐసయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎనిమిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సోమవారం తెలిపారు. (24–7) ఏఐ కంపెనీ వారిచే నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 420 మంది హాజరైనట్లు తెలిపారు. వీరిలో 88 మంది రెండో రౌండ్‌కు అర్హత సాధించారని తెలిపారు. వీరిలో 209 మంది టెక్నికల్ రౌండ్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. చివరిగా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎనిమిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం వేణు గోపాలరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఎస్ పూర్ణచంద్రరావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

రేపు జగనన్నకు చెబుదాం కార్యక్రమం



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో హనుమారెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం 3 గంటలకు బల్లికురవలో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో సెక్రటరీలు, వీఆర్వోలతో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల వారీగా అర్జీల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అర్జీ దారుల నుంచి సమస్యలకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్‌గా రంజిత్ బాషా అధికారులు పాల్గొంటారని ఎంపీడీవో వివరించారు. సదస్సులో ఈవోఆర్డీ దాసరి సుమతి, డీటీ రవికుమార్ పాల్గొని మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులకు గాయాలు

చినగంజాం: ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో తల్లీకొడుకులకు గాయాలయ్యాయి. ఈఘటన సోమవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని చినగంజాం పంచాయతీ పూలవారిపాలెం గ్రామానికి చెందిన మాదాసు అవిన్, అతని తల్లి పార్వతిని ఎక్కించుకొని బైక్‌పై చీరాల నుంచి తన గ్రామానికి వస్తున్నారు. చీరాల– ఒంగోలు జాతీయ రహదారిపై అడివీధిపాలెం అడ్డరోడ్డువద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బైక్ బలంగా ఢీకొట్టడంతో లారీ కిందకు దూసుకుపోయింది. ఈఘటనలో వారిరువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చీరాల వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం శ్రీనివాసరావు తెలిపారు.